

# అదొక తమాషా పెళ్ళి రోజు

వెంకట రమణ

‘‘అసలు నిన్ను కాదే, నీ బాబుని అనాలి. కలిసి రైల్లో కొన్ని గంటలు ప్రయాణం చేసిన నేరానికి నాతో పరిచయం పెంచుకొని నిన్ను అంటగట్టాడు. అమ్మమ్మ! ఎంత తెలివిగలవాడే నీ బాబు’’ అన్నాడు రామారావు.

వెంటనే అందుకుంది అతని భార్య లక్ష్మి – ‘‘చాల్లే ఊరుకోండి! మా నాన్న తెలివిగలవాడేమిటి? ఏమాత్రం కాస్త తెలివి ఉన్నా బంగారం లాంటి నన్ను, డిగ్రీ పాస్ అయిన నన్ను, డిగ్రీ తప్పిన మీకిచ్చి పెళ్ళి చేస్తాడా? అసలు మీ గురించి ఏ వివరాలు తెలుసుకోకుండా అల్లుడ్ని చేసుకుంటాడా’’ అన్నది.

స్వరం పెంచాడు రామారావు – ‘‘ఏమిటే! వివరాలు తెలుసుకునేది! ‘ఏమి చదివావు బాబూ’ అని అడిగాడు. ‘డిగ్రీ పూర్తిచెయ్యాలి’ అనే లోపు ‘డిగ్రీనా సంతోషం’ అన్నాడు. ఏ డిపార్టుమెంటు అని అడిగాడు. ‘కరెంటు’ వైరింగ్ చేస్తుంటా అనేలోపు ‘కరెంటాఫీసులోనా’ అన్నాడు ఇకిలిస్తూ. మీ ఆఫీసు ఎక్కడ అని అడిగాను. ‘సబ్‌స్టేషన్’ పక్కన అనేలోపు సబ్‌స్టేషన్‌లోనా అని సకిలించాడు’’ అన్నాడు రామారావు.

‘‘అయితే మాత్రం ఎలాగైనా చెప్పవలసిన బాధ్యత మీకు లేదా?’’ అడిగింది లక్ష్మి.

వెంటనే రామారావు – ‘‘నన్నసలు నోరు మెదపనిస్తేగా! చెబుదామని అనుకున్నప్పుడల్లా ఏదోఒకరకంగా అడ్డుతగిలి చెప్పనిచ్చేవాడు కాదు’’ అన్నాడు.

‘‘అందుకే కదండీ! మా నాన్న పోయేదాకా ఒకరి తల ఒకరు పట్టుకొని



24

ఏడ్చాం'' అన్నది లక్ష్మి.

''చాల్లే ఊరుకో! అసలు నాదొక సందేహం, నిన్ను వదిలించుకోవడానికే మీ నాన్న వివరాలు కూడా తెలుసుకోకుండా 'దొరికాడు చాల్లే' అని నాకిచ్చి పెళ్ళి చేశాడు. అయినా నీకేం తక్కువ. ముప్పొద్దులా మెక్కి, టి.వి. సీరియల్స్ చూస్తూ హాయిగా కాలం గడుపుతున్నావుగా'' నసిగాడు రామారావు.

''ఆహా! ఏమి భాగ్యం! నగలు నట్రానా! ఇల్లా వాకిలా! ఊర్లో అందరి ఇళ్ళకి వైరింగ్ చేయడమేగాని సొంతగా ఇల్లు కట్టుకోగలిగారా? ఇప్పుడు ఆ వైరింగ్ కూడా మానేసి నామీద ఫైరింగ్ చేస్తున్నారు'' అంది తల పట్టుకొని.

విసురుగా లేచాడు రామారావు. ఏమిటే, ఇల్లు వాకిలి అని మాట్లాడుతున్నావ్? మీ నాన్న ఇచ్చిన పది ఎకరాలు కూకట్‌పల్లి భూమి అమ్మి కోట్లు గడించి దాచిపెట్టుకొని నేనేదో ఇల్లు కట్టనట్టు మాట్లాడుతున్నావ్?''

''ఆహా! అదొకటే తక్కువ. డిగ్రీ కూడా పాస్‌కాని వాళ్ళకి కట్నాలు భూములు కూడా ఇస్తారు'' అన్నది చేతులు వూపుతూ.

''అదుగో. ఆ వంకర మాటలకే నాకు ఒళ్ళు మండేది. బొత్తిగా చిన్నపెద్ద లేకుండా'' అన్నాడు కసురుకుంటూ.

గయ్‌మని లేచింది లక్ష్మి – ''ఏమిటండీ పెద్ద,చిన్న! అసలు మీరు నాకంటే రెండురోజులే పెద్ద. తెలుసుగా! ఆ కాస్త పెద్దరికానికి మాటలు పడాలంటే కుదరదు''– తెగేసి చెప్పింది.

''అదుగో. అదేనే మీ నాన్న చేసిన మరో తప్పు. నా వయసు ఉన్న నిన్ను నాకు అంటగట్టాడు. బజార్లో వెళుతుంటే ఎవరు ఈమె? మీ అక్కనా? పిన్నా? అని జనం నవ్వుకోవడం ఇంకా నాకు గుర్తుందే రాక్షసి!'' అని వెంటనే ఆవేశంగా అన్నాడు రామారావు.

''ఆహా! అందగాడు బయలుదేరాడు. ఒకసారి అద్దంలో చూసుకోండి! నేను కాబట్టి మీ అవతారాన్ని చూస్తూ ఇన్నాళ్ళు బ్రతికున్నా'' అన్నది వెటకారంగా.

''నన్ను ఇప్పుడేం చూశావే. కాలేజీలో చదివే రోజుల్లో ఆడపిల్లలు నన్ను చూస్తూ తట్టుకొని పడే వాళ్ళు తెలుసా'' అన్నాడు గర్వంగా.

''వింతగా ఏదైనా కనబడితే ఎవరైనా చూడరా'' అన్నది లక్ష్మి గాలి తీస్తూ.

అంతలో వాళ్ళ కుమారుడు రవి వచ్చి – ''ఏమిటి నాన్నా? ఏమిటి అమ్మా? పొద్దున్నే ఈ గొడవ. మీ మనవడు మీ అరుపులకు లేచి ఏడుస్తున్నాడు.''

రామారావును పక్కకి పిలిచి ''ఏమిటి నాన్నా! ఇవాళ మీ పెళ్ళిరోజని సరదాగా గడుపుదామని హైద్రాబాద్ నుంచి వచ్చాము. అయినా అమ్మను చూడకుండా ఒక్కరోజు కూడా ఉండలేవు కదా! ఎందుకు నాన్నా ప్రత్యేకంగా ఈరోజు అమ్మను ఆట పట్టిస్తావు?'' అడిగాడు.

''నన్ను అంటావేమిటిరా! అలా చూడు. మీ అమ్మ ఎలా రెచ్చిపోతున్నదో'' అన్నాడు ఆమెవైపు చూపుతూ.

''మా నాన్న కనుక బ్రతికుంటే ఇవాళ నా పరిస్థితి ఇలా ఉండేదా?'' అన్నది గోడమీద ఫోటో చూస్తూ.

అటు చూసి రామారావు – ''అదేమిటే? మా నాన్న ఫోటో పక్కన మీ నాన్న ఫోటో ఎప్పుడు పెట్టావు? ధర్మరాజు పక్కన యమధర్మరాజు లాగా'' వెటకారంగా అన్నాడు.

''నన్నేమైనా అనండి. మా నాన్నను ఏమన్నా ఊరుకునేది లేదు'' అన్నది ఉరిమి చూస్తూ.

''ఊరుకోక ఏం చేస్తావే? మీ అమ్మను చివరిసారిగా చూసుకోరా! దీన్నిపుడు చంపేస్తా'' అన్నాడు రామారావు.

''గృహహింస నిరోధక చట్టం ఉంది తెలియదా? మరోమాట మాట్లాడారంటే వాళ్ళకు ఒక్క ఫోను కొడతా'' అన్నది లక్ష్మి వేలు చూపిస్తూ.

వీళ్ళ గొడవ ఆగాలంటే ఏదో ఒకటి చెయ్యాలి అనుకొని రవి టి.వి. ఆన్ చేశాడు. ఏవో భక్తి పాటలు వస్తున్నాయి. కింద స్క్రోలింగ్‌లో 'స్వామి అభయానంద దుర్గా లాడ్జి, రూమ్ నెం. నాలుగు వందల ఇరవైలో స్థిరంగా ఉన్నారు. భార్యాభర్తల సమస్యలకు పరిష్కారం చెప్పగలరు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్' అని వివరాలు వస్తున్నాయి.

వెంటనే లక్ష్మి ఆ ఫోన్ నెంబర్ రాసుకొని ''ఒరేయ్ రవీ! స్వామీజీకి ఫోన్ చేసి మా సమస్యకు పరిష్కారం చెబుతారేమో అడగరా'' అన్నది నెంబర్ ఇస్తూ.

దానికి రవి ''అమ్మా ఏమిటే నీ చాదస్తం. మీ ఇద్దరికీ అరవై ఏళ్ళు వచ్చాయి. ఇప్పుడు భార్యాభర్తల సమస్య అంటూ ఆయన దగ్గరకు వెళతారా? ఎవరైనా చూస్తే నవ్వుతారు. అదీకాక ఆ స్వామీజీ గురించి నేను విన్నాను. పెళ్ళాం వదిలేస్తే ఎక్కడికో వెళ్ళి గడ్డాలు మీసాలు పెంచుకొని వచ్చి ఈ అవతారం ఎత్తాడు అంటారు. ఇప్పుడు ఈ ఊరు వచ్చాడు. పెళ్ళాంతో కాపురం చెయ్యటం చేతకాక భైరాగి అయినవాడు భార్యాభర్తల సమస్యలకు పరిష్కారం చెప్పడమేమిటి?'' చిరాకుగా అన్నాడు రవి.

''ఏమోరా! ఏ పుట్టలో ఏ పాము ఉన్నదో'' అన్నది లక్ష్మి.

''ఏ పాము ఉన్నా వేలు పెట్టి మరీ కరిపించుకోవడం దేనికి?''

''ఏమోరా! నాకు అదేం తెలియదు. మీ నాన్న గొడవ ఇక నేను భరించలేను. వెంటనే స్వామీజీని కలిసే ఏర్పాటు చెయ్యి. ఇవాళ అటో ఇటో తేలిపోవాలి'' ముఖం విలనీగా పెట్టి అన్నది లక్ష్మి.

ఫలహారాలు ముగించుకొని రామారావు, లక్ష్మి, రవి, రవి భార్య శాంతి. వాళ్ళ బాబు కార్తీక్ అందరూ స్వామీజీ దగ్గరకు వెళ్ళారు. అక్కడ స్వామీజీ కొందరికి పూజలు, కొందరికి తగిన రాళ్ళతో ఉంగరాల ద్వారా పరిష్కారాలు చెబుతున్నారు. అందరూ వెళ్ళిపోయాక రామారావు, లక్ష్మి దంపతులు స్వామీజీ ముందు కూర్చున్నారు. ఆయన ఇద్దరి అరచేతులు పరీక్షగా కొంతసేపు చూసి పెద్దగా నిట్టూర్చి పెదవి విరిచాడు, ఈ రోగి ఇక బతకడు అని డాక్టర్లు చెప్పినట్టు.


''ఏమిటి స్వామీ అలా అయిపోయారు?'' అడిగాడు రామారావు.


''ఏమీ లేదు నాయనా. మీ ఇద్దరికి సఖ్యత ఏర్పడడం కష్టం. ఎలాగో మూడు వంతుల జీవితాన్ని గడిపేశారు. మీకూ అలవాటు అయిపోయి వుంటుంది. అలాగే మిగతా కాలాన్ని కూడా గడపండి'' అన్నాడు స్వామీజీ.

అందరూ ఒకరి ముఖం మరొకరు చూసుకున్నారు. ఇక వెళ్ళిపోవడానికి లేవబోతుంటే స్వామి ''ఆగండి నాయనా! తొందరపడకండి. నేనొక వ్రతం చెబుతాను. అది చేస్తే వచ్చే జన్మలో అనుకూల జీవిత భాగస్వాములు దొరుకుతారు'' అన్నాడు.

''ఈ జన్మకు ఇంతేనా స్వామి? వచ్చే జన్మ






సంగతి ఇప్పుడెందుకు?'' అడిగాడు రామారావు ముఖం అదోలా పెట్టి.

అందుకు స్వామీజీ ''చిరాకు పడకు నాయనా! పోయిన జన్మలో జాగ్రత్తపడి వుంటే ఇప్పుడు మీరు నా దగ్గరకు వచ్చే అవసరం ఉండేది కాదు. కనుక ఇప్పుడు ఈ వ్రతం చేస్తే వచ్చే జన్మలో తప్పక సుఖ పడతారు'' అన్నాడు.

''ఇంతకూ ఆ వ్రతం ఏమిటి స్వామి'' అడిగింది లక్ష్మి కుతూహలంగా.

వాటిపేరు ''భర్త కామేష్ఠి వ్రతం, భార్య కామేష్టి వ్రతం'' అన్నాడు స్వామి.

''ఇదేమిటి స్వామి పుత్రకామేష్ఠి గురించి విన్నాంగానీ ఈ భర్త కామేష్ఠి, భార్యకామేష్ఠి ఏమిటి విచిత్రంగా ఉన్నాయే?'' అడిగింది లక్ష్మి ఆశ్చర్య పోతూ.

''అవును తల్లీ! ఈ వ్రతం గురించి ఎవరికీ తెలి యదు. హిమాలయాల్లో నా తపోఫలం వల్ల మీకు అందుబాటులోకి వచ్చింది. ఈ వ్రతం భార్యాభ ర్తలు ఇద్దరూ ఒకరికొకరు సహకరించుకొని చేస్తే వచ్చే జన్మలో వాళ్ళకు వేరేవేరే సానుకూల జీవిత భాగస్వాములు దొరుకుతారు. ఇది తథ్యం'' అన్నాడు స్వామీజీ కనుబొమలు పైకిలేపుతూ.

''అయితే ఇపుడు మమ్మల్ని ఏమి చేయమం టారు'' అడిగారు ఆతృతగా ఆ దంపతులు.

అప్పుడు స్వామీజీ వివరిస్తూ ''మీరిద్దరూ కలిసి పక్కనే ఉన్న గూళ్లో ఉన్న నవగ్రహాలకు నూట ఎని మిది ప్రదక్షిణాలు చేసి నా దగ్గరకు రండి, ఆ! వచ్చే ప్పుడు రెండు పూలమాలలు, చెరొక ఇరవై ఆరు చొప్పున వంద రూపాయల నోట్లు ఒక్కొక్కదానిపై ఒక్కొక్క అక్షరం చొప్పున ఎ, బి, సి, డిలు రాసి పట్టుకురండి'' అన్నాడు.

'ఇక్కడ ఉన్నదన్నమాట అసలు కథ' అనుకు న్నాడు రవి. చెరొక రెండు వేల ఆరు వందలు అంటే ఐదువేలా రెండు వందలు స్వాహా అన్నమాట.

''కాబట్టి నేను చెప్పినట్లు చేసిరండి'' అన్నాడు స్వామీజీ. అంతా డబ్బుతో కూడిన విషయం కనుక అమ్మానాన్న ఒప్పుకోరు అనుకున్నాడు రవి. కానీ ఆ దంపతులు ''పదండి నవగ్రహాల దగ్గరకు'' అని లేచారు.

స్వామీజీ చెప్పినట్లు చేసి కాసేపటికి అందరూ తిరిగి వచ్చారు. స్వామీజీ ఆశ్చర్యంతో ''అరె! అప్పుడే వచ్చేశారే. మీకు వచ్చే జన్మ గురించి ఎంత శ్రద్ధ!'' అన్నాడు లోపల వందనోట్లు వస్తున్నాయన్న సంబరంతో.

వాళ్ళు ఇచ్చిన పూలమాలలు దేవుని పటం ముందు పెట్టి, నోట్లు కూడా పెడుతూ ''ఇదేమిటి నేను చెప్పింది వందనోట్లు కదా! పదినోట్లు తెచ్చారే మిటి?'' అడిగాడు విసుగ్గా.

''ఏమనుకోకండి స్వామీ! సమయానికి వంద నోట్లు దొరకలేదు. ప్రస్తుతానికి ఈ పదులలో కాని వ్వండి. మా దంపతులం ఈ వ్రతానికి వచ్చేట ప్పుడు వందలు తెస్తాంలే'' అన్నాడు రవి.

ఒక్కసారిగా ఆదాయం పదిరెట్లు పడిపోయే సరికి స్వామీజీ ముఖం మాడిపోయింది. చేసేదిలేక ఆ పది నోట్లు కూడా దేవుని పటం ముందు పెట్టి ఏవో అర్థంకాని మంత్రాలు చదివి ''ఇదుగో చూడండి. మీ దంపతులు ఈ పూలమాలలు ఒకరి మెళ్ళో ఒకరు వేసుకొని, అదుగో ఆ అగ్నిహోత్రం చుట్టూ ఏడు ప్రదక్షిణాలు చెయ్యండి'' అన్నాడు.

పూలమాలలు వేసుకొని రామారావు వేలు పట్టుకొని లక్ష్మి ప్రదక్షిణ చేస్తుంటే రవి, శాంతి ఎంతో సంతోషపడ్డారు. కార్తీక్ కూడా వినోదంగా చూస్తున్నాడు. ఏడుసార్లు తిరగటం అయ్యాక స్వామీజీ ''దీనితో మీ వ్రతం పూర్తయినట్లే. వచ్చే జన్మలో మీకు అనుకూల జీవిత భాగస్వాములు దొరకటం ఖాయం'' అన్నాడు.

దానికి రవి ''మీరు చెప్పింది జరుగుతుందని రుజువు ఏమిటి?'' అడిగాడు.

''నీవు ఈ ప్రశ్న అడుగుతావని తెలుసు నాయనా. ఆ నోట్ల మీద ఎ, బి, సి, డిలు ఎందుకు వ్రాయించాననుకున్నావ్? దంపతులు ఇరువురూ వారు రాసిన నోట్ల నుంచి ఏడు నోట్లు తీసి వరసగా పేరిస్తే రాబోయే కాబోయే మరుజన్మ జీవిత భాగ స్వామి పేరు తాలూకు సంకేతాలు కనబడతాయి'' అన్నాడు స్వామీజీ.

అదేదో వెంటనే తెలుసుకోవాలనే ఆతృతతో ఆ వృద్ధ దంపతులు చెరొక ఏడునోట్లు పేర్చారు. వరు సగా అక్షరాలు కలిసి చదవగా రామారావుకి LAK-SHMI అని, లక్ష్మికి RAMARAO అని వచ్చాయి. అది చూసి అందరితోపాటు స్వామీజీ కూడా నోట మాట రాలేదు. తను ఏదో చెయ్యబోతే ఏదో అయింది. స్వామీజీకి ఆ పదుల నోట్లు సమర్పించు కొని అందరూ నవ్వుకుంటూ ఇంటిదారి పట్టారు.

''మొత్తానికి మీ పెళ్ళి చూసే భాగ్యం మాకు కలి గింది. పెళ్ళిరోజు – షష్ఠిపూర్తి కలిసి అనుకోనివి ధంగా విచిత్రంగా ఈ స్వామీజీ దగ్గర జరిగాయి'' అన్నాడు రవి.

''ఫీజు కూడా అయిదు వందల ఇరవై కొట్టేశాడు కదరా!'' అన్నాడు రామారావు.

''పోనీలే నాన్నా! ఎ బి సి డిలు కాక అఆలు రాసి తెమ్మంటే అది రెట్టింపు అయ్యేది'' అన్నాడు రవి నవ్వుతూ.

★



26